# బాతుగాడికి ఒకటే

నాకు ప్రధమ కోపం. మా వారికి ద్వితీయ కోపం కూడా వుంది. అంచేత అతనికంటే నేనే బెటరని మా పిల్లలంతా ఏకగ్రీవంగా ఒప్పుకుంటారు - ఒక్క మా పెద్దమ్మాయి తప్ప.

దానికి తృతీయ కోపం కూడా ఉంది. అదెప్పుడూ కోపం ఛోంచేస్తూ ఉంటుంది.

కోపాలకి ఎన్ని డిగ్రీలున్నాయో నాకు తెలీదుకాని కోపం ముదిరితే పిచ్చి ఔతుందని మాత్రం అనుకుంటాను. అందుకే నాకు అప్పుడప్పుడు పిచ్చికోపం వస్తూ ఉంటుంది.

కోపం అన్న మాట విన్నప్పుడల్లా నాకు మా చిన్నప్పుడు లెక్కల మాష్టారు జ్ఞాపకం వస్తారు.

అప్పుడు నేను ఆరో క్లాసు చదువుతున్నాను. మా స్కూలు చరిత్రలో ఆరో క్లాసు వరకు ఏ ఆడపిల్లా చదవలేదు. "అంట్లు తోవుకునే ఆడముండకి ఆల్జీబ్రా ఎందుకురా" అనే రోజులవి. "చాకలి పద్దు వెయ్యడం వస్తే చాలు" అనేది మా అమ్మమ్మ. "అది కూడా ఎందుకూ? మొగుడు వెధవ చేసుకోలేడా?" అన్నానోసారి కోపంగా.

"ఏం సున్నితవే. సుందరమ్మ తల్లీ. మావాడి దగ్గర నీ ఆటలు సాగవులే" దీర్ఘం తీసిందావిడ.

సాగలేదు అమ్మమ్మా.

నేను భూమ్మీద పడిన మరుక్షణంలోనే నాకు మా వారితో ఎంగేజ్‌మెంట్ అయిపోయింది.

ఇంతకీ అసలు విషయం - ఆరో క్లాసులో శంకరం మేష్టారని లెక్కల మేష్టారుండే వారు. ఆకారం మాత్రం ఆర్నెల్ల నుండి అన్నం నీళ్ళు లేనట్టుండే వారు. అయితే మాటలోకాని, చేతలో కాని నీరసం

కనిపించేది కాదు. అతనికి పోలీస్ టార్చర్‌లో నమ్మకం లేదు. దెబ్బ కొడితే అది కనీసం వారం రోజులన్నా కనిపించాలి. దెబ్బతిన్న వాడికే కాదు, ఆ స్కూలంతటికీ బుద్ధి రావాలి.

ఒకసారి మా కజిన్‌ని ఆయన లెంపకాయ (చెంపపెట్టు అంటారేమో మీరు) కొట్టేరు. ఏ పేరైనా నొప్పి మాత్రం ఒకటే. మా కజిన్ ఎర్రగా టొమేటో పండులా ఉంటాడు. మేష్టారు ఇంకా ఎర్రగా ఉంటారు. అయితే అతని వేళ్ళమచ్చలు మాత్రం తారులా నల్లగా మావాడి బుగ్గల మీద పడ్డాయి. ఆ వేళ్ళ ఆనవాళ్లు చూసి మేష్టారే ఆశ్చర్యపోయేరు.

అంత దెబ్బతిన్నా వాడు శిలా విగ్రహంలా అయి ఉండిపోయేడు. కాని గొంతుక మాత్రం ఏదో మింగుతున్నట్టు ఆడిస్తున్నాడు.

"కొంపదీసి పళ్ళన్నీ రాలిపోలేదు కదా! అవన్నీ వీడు మింగేస్తున్నాడో ఏవిటో?" మేష్టారుకి భయం కాదు. అనుమానం వేసింది.

"నోరు విప్పు అంట్ల వెధవా" గర్జించేరు.

వాడి గొంతుక నుంచి వచ్చిన శబ్దం మనుషులు చేసిన శబ్దం కాదు.

ఏనుగుల ఘోష.

పులి పురుటి నొప్పుల పొలికేక.

ఎలుగుబంటి ఏడుపు.

పులులు పురుటి కేకలకీ, ఏనుగుల ఘీంకారాలకీ జడిసే రకం కాదు మేష్టారు.

"నోర్మూయ్" గాండ్రించేరు.

మూసేడు. పులి, ఏనుగు, ఎలుగుబంటి అన్నీ సామూహికంగా వచ్చేయి.

వీడు ఇంటి దగ్గర అమ్మ, నాన్నలతో చెప్పుకొని ఏడ్చేడు.

"మంచి పన్జేశాడు" అన్నాడు నాన్న.

"మరో నాలుగెయ్యాల్సింది" అంది అమ్మ.

"ఎందుకు కొట్టేడు? నువ్వేం తప్పు చేసేవు?" వగైరా ప్రశ్నలు ఆ రోజులలో లేవు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ ది చైల్డ్, యూనిసెఫ్ వగైరాలూ లేవు.

"దండం దశగుణం భవేత్" అన్న సూక్తి నమ్మిన రోజులు. మేష్టర్లు శాయశక్తులా పిల్లల్ని కొట్టినా "ఇంకా బద్ధకిస్తున్నారు" అనేవారు తల్లిదండ్రులు.

ఇప్పుడు కాన్వెంట్ల యుగం. బూతులు కూడా ఇంగ్లీషే. అయితే ఇంగ్లీషులో కూడా "స్పేర్ ది రాడ్, స్పాయిల్ ది చైల్డ్" అని వుంది. కాని అది మాత్రం వదిలేశారు.

శంకరం మేష్టారు ఎప్పుడూ నిప్పు మింగుతున్నవాడిలా ఉండేవారు. బెంచీల మీద కూర్చుంటే చదువు అబ్బదని అతని స్వంత థియరీ (ఆయన చదువుకునే రోజుల్లో బెంచీలు లేవేమో). అలాగని నేలని కూర్చోబెట్టేవారు కాదు.

నిలబెట్టే వారు. ఎక్కడ?

బెంచీల మీద.

కారణం జ్ఞాపకం లేదు కాని అతని క్లాసులో అందరూ బెంచీల మీదే నిల్చునే వారు. మా ఆడపిల్లల్ని మాత్రం 'మీకెందుకర్రా చదువులు? శుభ్రంగా పెళ్ళి చేసుకొని సంసారాలు చేసుకోక. సరే...స....కిందే నిల్చోండి' అని కిందనే నిలబెట్టేవారు.

ఆయన సోమవారం తప్ప మిగతా రోజులలో హిట్లర్. సోమవారం మాత్రం తాచుపాముల్తో సహా ప్రళయ రుద్రుడు. ఆయన ప్రతి సోమవారం గుండు కొట్టించేవాడు. ఆ రోజుల్లో షేవింగ్ క్రీములు, ఆఫ్టర్ షేవ్‌లు వగైరాలేం లేవు. కత్తులూ అంతంత మాత్రవే.

గుండు చెయ్యడానికి, కోడిని కొయ్యడానికి ఒకటే కత్తి మరి.

పాపం అన్నిటికీ మేష్టార్ని నిందించి లాభంలేదు. క్షురకర్మోడి ధర్మవా అని సోమవారంనాడు అతని బుర్ర సగం చెక్కిన పనసకాయలా ఉండేది.

అంచేత సోమవారం ఆడపిల్లల్ని కూడా బెంచీ ఎక్కిస్తారేమోనన్న భయంతో ఆవేళ అతని క్లాసు ఎగ్గొట్టేసే వాళ్ళం. మొగపిల్లలు మాత్రం ఆయన వచ్చేసరికే బెంచీ ఎక్కేసేవాళ్ళు.

క్వార్టర్లీలో అనుకుంటాను. మా కామూగాడికి నూటికి రెండు మార్కులు వేశారు. అప్పట్లో దెబ్బల భయంవల్ల మాకు తట్టలేదుకాని ఇప్పుడొస్తున్న న్యూమేథ్స్ మా మేష్టారే కనిపెట్టి ఉంటారు. ఆయన చేతిలో నూటికి ఐదు ఫస్టుమార్కు! "మేథ్స్‌లో నూటికి ఐదు ఫస్టు

ఎలా ఇచ్చేవారమ్మా. మరీ కథల్చెప్పకు" అడిగింది మా పెద్దమ్మాయి ఓసారి.

"నాలుగివ్వాలా?" అంది చిన్నది.

"నాలుగిస్తాను కాని నోర్ముయ్" అని దాన్ని తిట్టి "ఇంతకీ ఐదు ఫస్టేవిటమ్మా?" అంది.

పెళ్ళాం పారిపోయిందని పోలీసులకి రిపోర్టిస్తే డౌరీడెత్ అయుంటుందని ఇనస్పెక్టరు అంటే అప్పుడు పెళ్ళాం పారిపోయినవాడి మొహం ఎలా ఉంటుంది? నా మొహం అలాగే ఉంది.

అయితే మా అమ్మాయి లిద్దరి దెబ్బలాటలో అసలు విషయం మర్చిపోయేరు.

ఆ ఐదుమార్కుల దౌర్భాగ్యం నాదేనని చెప్తే భోరుమంటారేమోనని ఆ రహస్యం ఇంతవరకు నాలోనే దాచుకున్నాను.

మా కాముగాడ్ని వాళ్ళనాన్న చేతుల్తో చితక్కొట్టేడు. చేతులు నొప్పెట్టేయి. కర్రతో కొట్టేడు. కాముగాడికి ఏడిచేశక్తి పోయింది. వాళ్ళనాన్నకి కొట్టే ఓపిక పోయింది.

ఇద్దరూ ఆగేరు.

కొంతసేపు ఆయాసం తీరేక "రెండట్రా దొంగ వెధవా?" కసిరేడు వాళ్ళనాన్న.

"ఏవిటి రెండో" కాముగాడికర్థం కాలేదు. ముందు కళ్ళల్లో నీళ్ళు కారేయి.

ఔను. కళ్ళు రెండు.

కాళ్ళు వణికేయి.

కాళ్ళూ రెండే

చేతులు సలుపుతున్నాయి.

చేతులు రెండే.

చెవులు మండుతున్నాయి.

అవీ రెండే మరి.

శంకరాచారికో, మరో మహానుభావుడికో ప్రపంచం అంతా ఒక్కటిగా కనిపించిందిట. కాని మా కాముగాడికి మాత్రం ఆ క్షణంలో ప్రపంచం రెండుగా కనిపించింది.

"రెండే" అన్నాడు అమాయకంగా.

"రెండే" అనడానికి సిగ్గులేదుట్రా?" అని మళ్ళీ వాళ్ళ నాన్న కొట్టడం ప్రారంభించేడు.

వాడికిప్పుడీ దెబ్బలు నొప్పెట్టడంలేదు. సిన్సియర్‌గా జవాబు చెప్తే ఎందుకు కొడుతున్నారురా అన్న సమస్యే వాడ్ని తినేస్తోంది.

ఎంత భగవధ్యానంలో ఉన్నా మేకుల చెక్క మీద కొంతసేపే పడుక్కోగలం. తరువాత ఏదో ఒక మేకు గుచ్చుకోక మానదు.

సరిగ్గా అదిగో అప్పుడే...

మోకాలి మీద దెబ్బపడింది.

ఎంత పెద్ద దెబ్బ అయినా నొప్పి తెలియకూడదంటే అంతకంటే పెద్ద దెబ్బ తగలాలి.

ఈ "రెండేవిటి" అన్న సమస్య చిన్నది.

మూడుకు మీది దెబ్బ పెద్దది.

ఆ దెబ్బకి వాడు గాలిలోకి ఎగిరేడు.

కాకిలాగానో, పిచ్చికలాగానో, ఏరోప్లేన్‌లాగా పరిగెట్టి కాదు. ఉన్నచోటు నుంచి హెలికాప్టరులాగ గాలిలోకి ఆరడుగులు వేశేడు.

గాలిలో ఉన్న వాడు ఎంతసేపు గాలిలో ఉంటాడు? నేలకి దిగాలి.

ఎక్కడ దిగడం?

ముందు కర్రతో సహా వాళ్ళ నాన్న –

కుడి వైపు దూడతో సహా వాళ్ళ గేదె –

ఎడం పక్క ముళ్ళతో నిమ్మచెట్టు –

అంచేత – బతికుంటే భూమ్మీద కాకపోతే గాల్లోనైనా బతకొచ్చు అనుకొని చేతి కందింది పట్టుకున్నాడు. అది వేపకొమ్మ.

"భూమ్మీదున్న పిల్లడు ఏమైపోయేడు?"

వాళ్ళ నాన్నకీ భయం వేసింది.

చుట్టూ చూశాడు.

లేడు.

పైకి చూశాడు.

వేప కొమ్మకి వేలాడుతున్నాడు.

వాళ్ళ నాన్నకి మళ్ళీ కోపం వచ్చింది.

"వెధవా! లెక్కల్లో ముష్టి రెండు మార్కులు తెచ్చుకోవడవే గాకుండా కోతిలా చెట్టు పట్టుకుని వేలాడుతున్నావా? కిందకి దిగు చెప్తాను నీ పని"

హమ్మయ్య. ఈ రెండు మిష్టరీ సాల్వ్ అయింది. ఇంతా చేస్తే మార్కులకోసవా ఇదంతా?

తిన్న దెబ్బలన్నీ మరిచిపోయిన కాముగాడు "బాతుగాడికి ఒకటే" అని అరిచి గెంతి పారిపోయేడు.

*("ఆంధ్రజ్యోతి" వారపత్రిక 11-22, 19992)*

★ ★ ★